నేటి దినపత్రిక
సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 15 అక్టోబర్ 2024 | పేజీలు 8

## నెల్లూరు జిల్లా ప్రజలకు కాకాణి విజ్ఞప్తి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా ప్రజలకు మరి ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలందరు జాగ్రత్తగా ఉండాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తుఫాను సమయం లో తీవ్రమైన పెనుగాలులు వీచే అవకాశం ఉందని, పిడుగులు పడే ప్రమాదం ఉంటుంది కాబట్టి పశువుల కాపరులు, రైతులు మరియు ప్రజలందరూ అప్రమత్తంగా వుండి అవసరమైతే తప్ప బయటకి వెళ్లకుండా ముఖ్యంగా చెట్ల కింద, కరెంటు స్తంభాల కింద ఉండకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంటు జాగ్రత్తలు వహించాలని, ముఖ్యంగా తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఈ సమయంలో వేటకు వెళ్ళకుండా అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలలో వుండాలని కోరారు.

## బంగాళాఖాతంలో..

# తుఫాన్ ఉగ్రరూపం



- పెరుగుతున్న సముద్ర ఉష్ణోగ్రతలు
- ఇక నెలంతా తుపాన్లే
- బంగాళాఖాతంలో పొంచి ఉన్న తుపాను ముప్పు
- గత పదేళ్లలో అక్టోబరు -డిసెంబరు మధ్యకాలంలో 11 తుపాన్లు ఏర్పడగా, 6 ఏపీలోనే తీరం దాటాయి
- అక్టోబరు-డిసెంబరు మధ్యలోనే ఏపీపై ప్రభావం చూపుతున్న తుపాన్లు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** బంగాళాఖాతంలో తుపాను ముప్పు పొంచి ఉందని వాతావరణశాఖ తెలిపింది. సాధారణంగా అక్టోబరు, నవంబరు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌కి తుపాన్ల ముప్పు ఎక్కువగా ఉంటుంది. ప్రతి సంవత్సరం అక్టోబరులో నైరుతి రుతుపవనాలు తిరోగమించి, ఈశాన్య రుతు పవనాలు ప్రవేశిస్తాయి. ఈశాన్య రుతుపవనాల ప్రవేశించే సమయంలో సముద్ర ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి.



ఇటువంటి సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటానికి పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో, అవి క్రమేపీ వాయుగుండాలు, తుపాన్లుగా మారతాయి. నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. ఇది తీవ్ర వాయుగుండం, తర్వాత తుపానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. గత పదేళ్లలో అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో 11 తుపాన్లు ఏర్పడగా, అందులో 6 ఏపీలోనే తీరం దాటాయి.

### మరలా కుంభవృష్టి వర్షాలు కురిసే అవకాశం

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం నెలకొన్న ప్రాంతం నుంచి చెన్నై తీరం వరకు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. వీటి ప్రభావంతో ఒక్కసారిగా తీవ్రత పెరిగే ప్రమాదముందని తెలుస్తోంది. మరోవైపు అరేబియా సముద్రంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది. అక్కడి నుంచి బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం వరకూ ద్రోణి కొనసాగుతుంది. సెప్టెంబరు నెలలో ఇదే విధంగా బంగాళాఖాతంలో వాయుగుండం, అరేబియా సముద్రంపై కదులుతున్న తుపాను ప్రభావంతో రుతుపవన ద్రోణి ఏర్పడి

-మిగతా 2లో

## ప్రశాంతంగా సాగిన

# లక్కీ డీప్ ప్రక్రియ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ వెల్లడించారు. సోమవారం ఉదయం నెల్లూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్భ కళాక్షేత్రంలో మద్యం దుకాణాల కేటాయింపునకు లక్కీడిప్ ప్రక్రియను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 8 గంటల ప్రారంభమైన లక్కీడిప్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీగా చేరుకున్న టెండరు దరఖాస్తు దారులతో కళాక్షేత్రం కిటకిటలాడింది. ప్రశాంతంగా నిర్వహించిన దుకాణాల లక్కీడిప్ ప్రక్రియ మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్

-మిగతా 2లో

## వర్షాల సమయంలో అందరూ

# అప్రమత్తంగా ఉండండి

- అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి
- ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే నివారించేందుకు సంసిద్ధంగా ఉండండి
- లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించండి
- వర్షాల నేపథ్యంలో అధికారులకు దిశా నిర్దేశం
- మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా 14, 15, 16 తేదీల్లో విస్తారంగా వర్షాలుంటాయని అధికారులు ప్రజలు 24-7 అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ సూచించారు. సోమవారం నెల్లూరు మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల ముప్పు వాటిల్లకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతోపాటు మున్సిపల్ వ్యవస్థ, కార్పొరేషన్ వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు 24-7 అప్రమత్తంగా ఉండాలని మంత్రి నారాయణ సూచించారు. కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్‌లు ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం

-మిగతా 2లో

## యుద్ధ ప్రాతిపదికన వర్షపు నీరు

# నిలువ ఉండకుండా చర్యలు

### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వర్షపు నీరు ప్రధాన రోడ్లపై నిల్వ ఉండకుండా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు కమిషనర్ సూర్యతేజ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయి. స్థానిక కెవిఆర్ పెట్రోల్ స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డులోని ట్రంక్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న దుకాణాల మెట్లు, ర్యాంపులు, ఇతర చిన్న చిన్న నిర్మాణాలను జేసిబి యంత్రాల సహాయంతో తొలగించారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వవుండకుండా అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని అధికారులు, సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. డ్రైను కాలువల్లో వర్షపు నీటి ప్రవాహానికి అంతరాయాలు లేకుండా అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్నామని, వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా నిరంతరం అవసరమైన చర్యలు తీసుకుంతున్నామని కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్, ఈఈ రహంతు జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరులో భారీగా మద్యం సిండికేట్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఎక్కువ శాతం మద్యం సిండికేట్లే షాపులు దక్కించుకున్నట్లు తెలిసింది. నెల్లూరు సిటీ పరిధిలో మంత్రి నారాయణ తమ కార్యకర్తల కోసం మద్యం టెండర్లను అధిక సంఖ్యలో దాఖలు చేయడం జరిగింది. అయితే మంత్రి నారాయణ ఆధ్వర్యంలో వేసిన 100 షాపులకు గాను కేవలం మూడు షాపులు మాత్రమే దక్కించుకున్నారు. మిగతా షాపులను గతంలో లిక్కర్ వ్యాపారంపై అవగాహన ఉన్న మద్యం వ్యాపారస్తులు రంగంలోకి దిగి కొంతమంది షాపులను దక్కించుకున్నారు. అయితే రూరల్ ప్రాంతంలో మాత్రము షాపులు దక్కించుకున్న స్థానిక నాయకులు దగ్గరకు పోవాల్సిందే. ఇంతమంది కేవలం ఒక దరఖాస్తు అదృష్టం వరించింది. ఒకే వ్యక్తికి అదృష్టములో రెండు షాపులు కూడా లాటరీలో అదృష్టం వరించింది. అదేవిధంగా రూరల్ ప్రాంతంలో కూడా సింగిల్ దరఖాస్తు చేసిన వారు కూడా షాపు వరించి లాటరీలో షాపు దక్కించుకున్నాడు. ఈ లాటరీలో మద్యం షాపులను దక్కించుకునేందుకు మహిళలు కూడా అధిక శాతం పోటీ పడ్డారు. నెల్లూరు సిటీ, రూరల్ అధికార పార్టీ నేతలు ఇద్దరూ ఒక్క తాటిపై నడిచినట్లు సమాచారం. లినెల్లూరు నగరం, రూరల్‌లోని 38 షాపులకు పోటా పోటీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఆయన లక్కీ ఒక్కరిని మాత్రమే అదృష్టం వరించింది. రెండు లక్షల రూపాయలను వెచ్చించి దరఖాస్తు చేశారు. కొంతమంది ఐదు షాపుల వరకు దరఖాస్తు చేశారు లక్కీ డిప్ కొంతమందికి నిరాశ మరి కొంత మందికి ఆనందం కలిగించింది. లక్కీ డిప్ ద్వారా పలు షాపులను సొంతం చేసుకున్నవారు అదృష్టవంతులు అనుకోవచ్చు కానీ అధికార పార్టీ కనుసన్నల్లో జరగాల్సి ఉంటుందని కొంతమందికి అనుమానం వ్యక్తం కలుగుతుంది. నెల్లూరు నగరం, రూరల్ సిండికేట్‌లకు పలు షాపులు విడిగా టెండర్లను దాఖలు చేసిన పలువురు వ్యాపారులకు కూడా లక్కీ డిప్పులో అదృష్టాన్ని వరించింది. అదృష్టం తలుపు తట్టడం అంటే అదే కావచ్చు ఏమో కానీ 20, 30 షాపులకు టెండర్లు వేసిన కొంతమందికి ఒక్క మద్యం దుకాణం కూడా రాలేదు. కానీ ఒకే ఒక్క టెండర్ వేశాడు లక్కీ డిప్‌లో అదృష్టం వరించి మద్యం షాపును సొంతం చేసుకున్నాడు.

# భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండండి

## కంట్రోల్ కేంద్రం ద్వారా సత్వర స్పందన : మేయర్ స్రవంతి జయవర్ధన్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది ఏలాంటి విపత్కర పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారని మేయర్ తెలియజేశారు. భారీ వర్షాల సూచనల నేపథ్యంలో కార్పొరేషన్ ఇండోర్, ఔట్ డోర్ సిబ్బంది అంతా యుద్ధ ప్రాతిపదికన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మేయర్ స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా అవసరమైతేనే బయటికి రావాలని తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా బాధితుల నుంచి సమాచారం తెలుసుకుని వెంటనే అధికారులు స్పందించాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో స్థానికంగా సమస్యలు ఏర్పడితే 0861 2356777, 0861 2316777 నెంబర్లకు సమాచారం అందించి నగర పాలక సంస్థ నుంచి తగిన సహాయం పొందాలని మేయర్ సూచించారు. పాదచారులు, వాహన చోదకులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రధాన ప్రాంతాలలో అధికారులు పర్యవేక్షించాలని మేయర్ ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలు భారీ వృక్షాలు,



హోర్డింగులు సమీపంలో నిలవడం, వాహనాలు పార్క్ చేయడం, విద్యుత్ స్థంబాలను చేతితో తాకడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని మేయర్ సూచించారు.

# బంగాళాఖాతంలో తుఫాన్ ఉగ్రరూపం

*(మొదటి పేజీ తరువాయి)*

విజయవాడ నగరంలో కుంభవృష్టి కురిసింది. మరోసారి అదేవిధంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని నిపుణులు అంచనా

### లోతట్టు ప్రాంతాలకు ముంపు ముప్పు

ఇటీవల కురిసిన వర్షాలకు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండల్లా మారాయి. వాయుగుండం, తుపాను ప్రభావంతో కొన్ని చోట్ల ఒక రోజులో 15 నుంచి 20 సెంటీ మీటర్ల వర్షం కురిసే అవకాశముంది. ఇటీవల విజయవాడలో నెలకొన్న పరిస్థితి పునరావృతం కాకుండా ఇప్పటినుంచే అంతా అప్రమత్తం కావాలి. కాలువలు, వంకలు, వాగులు ఎక్కడెక్కడ బలహీనంగా ఉన్నాయో వాటిని పరిశీలించి పటిష్ఠం చేసుకోవాలి. కొద్దిరోజుల్లో వరి పంట చేతికి రానున్న నేపథ్యంలో అన్నదాతలు జాగ్రత్తగా ఉండాలి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవాలి.



### తీరం దాటిన ప్రాంతం ప్రభావితమైన జిల్లాలు

- 2014 అక్టోబరు (హుద్‌హుద్) విశాఖపట్నం, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం
- 2016 డిసెంబరు (వార్దా) చెన్నై సమీపంలో నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, కడప
- 2018 అక్టోబరు (తిత్లీ) పలాస సమీపంలో శ్రీకాకుళం, విజయనగరం
- 2018 డిసెంబరు (పెథాయ్) కాకినాడ సమీపంలో కృష్ణా, తూర్పు, పశ్చిమగోదావరి
- 2021 సెప్టెంబరు (గులాబ్) కళింగపట్నం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం
- 2022 డిసెంబరు (మాండౌస్) మహాబలిపురం సమీపంలో చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్
- 2023 డిసెంబరు (మిచౌంగ్) బాపట్ల చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలు. ఇటీవల విజయవాడలో వచ్చిన వరద పరిస్థితి నెల్లూరు జిల్లాకు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

### జనజీవనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా..

# చర్యలు చేపట్టాలి : కలెక్టర్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**



జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున జన జీవనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. జిల్లాలో భారీ వర్షాల ప్రభావం, చేపట్టిన ముందస్తు చర్యలపై కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా రెవెన్యూ, పోలీసు అధికారులను అప్రమత్తం చేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ చెప్పారు. లోతట్ట ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. 161 బోట్లు సముద్రంలో వేటకు వెళ్లగా అన్ని బోట్లను కూడా తిరిగి రప్పించి, 650మంది మత్స్యకారులను సురక్షితంగా వెనక్కు రప్పించినట్లు కలెక్టర్ చెప్పారు. అల్పపీడనం తుపానుగా మారితే ప్రజలను సురక్షితంగా తరలించేందుకు 146 పునరావాస కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. ఒకటి, రెండు రోజుల్లో అవసరాన్ని బట్టి 9 మండలాల్లో 42 గ్రామాల్లో ఈ కేంద్రాల ఏర్పాటుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. సోమశిల, కండలేరు జలశయాలకు ఎటువంటి ప్రమాదం లేదని చెప్పారు. సోమశిలకు వరద ప్రవాహం పెరిగితే ముంపునకు గురయ్యే 127 గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేశామని, ఎప్పటిప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ రెవెన్యూ అధికారులకు ఆదేశిలిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదం లేదని కలెక్టర్ చెప్పారు. పెన్నానది పరివాహక ప్రాంతంలో పెన్నా రక్షణ గోడలను పరిశీలించాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చామని, ఏద్కైనా ప్రమాదం జరిగితే ఎదుర్కొనేందుకు ఇసుకబస్తాలు సిద్ధం చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. పూరిళ్లలో వున్న ప్రజలు అప్రమత్తంగా వుంటూ సమీపంలోని సురక్షితమైన భవనాల్లోకి వెళ్లేందుకు సిద్ధంగా వుండాలని చెప్పారు. ఎటువంటి విపత్కర పరిస్థితిన్కైనా ఎదుర్కొనేందుకు వెంకటగిరిలో ఒక ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం, నెల్లూరులో ఒక ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం అందుబాటులో వున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లా ప్రజలెవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని, మరో మూడురోజులు మాత్రం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

### వర్షాల సమయంలో అందరూ

# అప్రమత్తంగా ఉండండి

*(మొదటి పేజీ తరువాయి)*




సంసిద్ధంగా ఉండాలన్నారు. వర్షాలు కురవనున్న నేపథ్యంలో గండ్లు పడే కాలువలు, గట్లను గుర్తించి పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రధానంగా వర్షపు నీటి ప్రవాహానికి సంబంధించి సైడ్ కాలవల్లో సిల్ట్ తీసేందుకు ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడ కూడా వర్షపు నీరు నిలువ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే నివారణ చర్యలు చేపట్టేందుకు, ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు తెలియజేశారు. అవసరమైతే లోటంత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రస్తుత విపత్తుల సమయంలో తాను 24-7 అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చిన నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు మంత్రి సూచించారు. అధికారులను అప్రమత్తం చేశారు.

**మీకు సాయం చేస్తున్న వారిని మరవకండి..**
**మిమ్మల్ని ప్రేమిస్తున్న వారిని ద్వేషించకండి..**
**మిమ్మల్ని నమ్ముతున్న వారిని మోసం చేయకండి..**
**- స్వామి వివేకానంద.**

# ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం

## నెల్లూరులో మంత్రి నారాయణ వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో మూడురోజులపాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అల్పపీడనం తుపానుగా మారితే ఈనెల 17న తీరం దాటొచ్చని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. సీఎం చంద్రబాబు కీలక సలహాలు, సూచనలు ఇచ్చారని భారీ వర్షసూచన నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేశామన్నారు.. కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించి.. అనంతరం మీడియాతో మాట్లాడారు.. మున్సిపల్ కమిషనర్లు అందరికీ వెంటనే సిల్టు తీయాలని, బాటిల్ నెక్స్ క్లీన్ చేయమని ఆదేశాలిచ్చామన్నారు. ఏ ఒక్కరి ప్రాణనష్టం జరగకూడదని సీఎం చంద్రబాబు ఆదేశించారని, లోతట్టు ప్రాంతంలో నివాసం ఉండేవారిని వెంటనే పునరావస కేంద్రాలకి తరలించే ఏర్పాటు చేశాంమని వెల్లడించారు. వాటర్ ట్యాంకులు, జనరేటర్లు, ఎక్సకవేటర్లు, ట్రాక్టర్లని ముందుగా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఆహారం, తాగునీరు వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కమాండ్ కంట్రోల్ రూమ్స్‌కి విజయవాడ నుంచి ఆదేశాలిస్తున్నామని తెలిపారు. కలెక్టర్లు, అధికారులు లోతట్టు ప్రాంతాల్లో వారిని ఖాళీచేయమని సూచిస్తే, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# తుపాను పరిస్థితులపై మండల అధికారులతో సమీక్ష




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి అధికారులతో తహసీల్దార్ ఎస్ఎ హామిద్ సమీక్షా సమావేశం నిర్వహించారు మండలంలో సోమవారం ఉదయానికి 45.2 మీ.మీ వర్షపాతం నమోదైందని పగలు 30.0 మిమీ వర్షపాతం నమోదైంది వచ్చె రెండు మూడు రోజుల్లో బారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు బల హీనంగా ఉన్న చెరువు కట్టలు వద్ద నీటిపారుదల శాఖ వారు తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు వ్యవసాయ ఉద్యానశాఖలు ఆర్ అండ్ బీ పిఆర్ ఐ సీడీఎస్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మండల స్థాయి అధికారులు పలు శాఖల ఏఈలు పాల్గొన్నారు.

## బొగ్గుబట్టి కూలీలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన వరికుంటపాడులో ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో బొగ్గుబట్టిలలో పనిచేస్తున్న కూలీలకు ఇబ్బందులను గుర్తించి తూర్పు రొంపి దొడ్ల గ్రామ సర్పంచ్ కూండ్ల నాగేశ్వరి, లక్ష్మీ నరసయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మారినేని రామకృష్ణ భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మారినేని మాట్లాడుతూ.. రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో వరికుంటపాడు బొగ్గుబట్టీలలో పనిచేస్తున్న కూలీలు భోజనం చేసుకునేందుకు వీలు లేని పరిస్థితుల్లో ఉన్నారని సమాచారం అందడంతో వెంటనే వారికి భోజన ప్యాకెట్లను ఏర్పాటు చేసి ఈరోజు సాయంత్రం వారికి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లా నాగయ్య, బ్రహ్మయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువలు శుభ్రం చేయాలి : కమిషనర్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** సోమవారం ఉదయం నుంచి నెల్లూరు నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు పలు కాలవల్లో జేసీబీల ద్వారా వ్యర్థాలను తొలగిస్తున్నారు. నగరంలోని అండర్ బ్రిడ్జిలు వద్ద మోటార్లను ఏర్పాటు చేసి వర్షపు నీటిని పంపించేస్తున్నారు. ఎప్పటికప్పుడు కమిషనర్ సూర్యతేజ నగరంలో వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండ ముందుస్తే జాగ్రత్త చర్యలు చేయిస్తున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## నేడు కేజీబీవీ పోస్టులకు దరఖాస్తులు ఆఖరి రోజు

● కో ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఉషారాణి

**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ ద్వారా నిర్వహించబడుతున్న జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న 14 బోధనేతర సిబ్బంది పోస్టులకు ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన 2024-25 మంగళవారం సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళ అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత మండల విద్యాశాఖ అధికారియాలయంలో ఆఫ్‌లైన్ ద్వారా అందజేయవలసిందిగా ఆమె తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వారికి వయోపరిమితి 52 సంవత్సరాలకు పొడిగించడం జరిగిందని ఆమె తెలిపారు.

## మండలంలో 3 మద్యం షాపులు కైవసం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని మూడు మద్యం షాపులకు 31, 32, 33 షాపులకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోగా లాటరీ పద్ధతిలో ముగ్గురు కైవసం చేసుకున్నారు. షాప్ నెంబర్ 31 చింతా ప్రభాకర్ రెడ్డి, షాప్ నెంబర్ 32 తుమ్మల మోహన్ చౌదరి, షాప్ నెంబర్ 33 ఇందుపూరు అచ్యుత శంకర్ రెడ్డి కైవసం చేసుకున్నారు. ప్రభుత్వ చేపట్టిన నూతన మద్యం విధానం 16 తేదీ నుండి అమలులోకి రానున్నది.

## టెట్ పరీక్షకు 52 మంది అభ్యర్థులు గైర్హాజరు

**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** జిల్లాలో నాలుగు కేంద్రాల్లో నిర్వహిస్తున్న టెట్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 52 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం సెక్షన్‌కు 130మంది అభ్యర్థులు కాను 108 మంది అభ్యర్థులు హాజరైనారని, మధ్యాహ్నం సెక్షన్‌కు 130మంది అభ్యర్థులు గాను 100మంది అభ్యర్థులు హాజరైనారని అధికారులు తెలిపారు.

## కావలి ఎమ్మెల్యేని కలిసిన ఆర్డీఓ వంశీకృష్ణ



**కావలి, మేజర్‌న్యూస్ :** ఇటీవల కావలి ఆర్డీఓగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్.వంశీ కృష్ణ ఆదివారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాల కారణంగా ప్రజలకు ఎక్కడ కూడా ప్రమాదాలు గురికాకుండా లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వారికి కావలసిన ఆహారం, నీరు అందించే విధంగా అధికారులను అప్రమత్తం చేయాలని తెలిపారు.

## చైర్మన్‌ని కలిసిన చేనేత నాయకులు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్యని ఆదివారం మంగళగిరిలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన అఖిలభారత చేనేత విభాగ జాతీయ అధ్యక్షులు బూదాటి రాదయ్య ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం గౌరవ సభ్యులు జగ్గారపు శ్రీనివాసులు, అఖిలభారత పద్మశాలి సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ, అఖిలభారత పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సోమ గోపాల్ తదితర నాయకులు కలిశారు.

## పంటలు నష్టపోకుండా జాగ్రత్త వహించండి : ఏఓ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పంటసాగు చేస్తున్న రైతాంగం తగు జాగ్రత్తలు వహించాలని అనంతసాగరం మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 625 ఎకరాల్లో వరి, 60 ఎకరాల్లో మినుము సాగు అవుతుందని తెలిపారు. వరిపంట కోత దశలో ఉన్నదని, మినుము శాఖీయ దశలో ఉంటున్న నేపథ్యంలో పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. వర్షాలకు వరి పైరు నేలకు వాలిపోయే పరిస్థితి ఉంటుందని మూడు నుంచి నాలుగు కుదుర్లు కలిపి కట్టాలని సూచించారు.

## నగర నియోజకవర్గ

# ప్రజలు అప్రమత్తంగా ఉండండి

▶ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి విజ్ఞప్తి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాకు రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో నెల్లూరు నగరం నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తీవ్రమైన పెనుగాలులు పిడుగులు పడే అవకాశం ఉంటుందన్నారు. అవసరమైతే తప్ప ఇంట్లోంచి ఎవరు బయటకు రావద్దుని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలను ఎవరు ముట్టుకోవద్దని తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఎవరు బయటకు వచ్చి ఇబ్బంది పడొద్దుని మీకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన స్థానికంగా ఉండే తెలుగుదేశం పార్టీ నేతలకు సమాచారం ఇవ్వాలన్నారు. తనతోపాటు మా పార్టీ కార్యకర్తలు అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు.

# తుఫాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

- విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు
- డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
- ఏపీఎస్ పీడీసీఎల్ సీఎండీ కె.సంతోష రావు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఏపీఎస్ పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ పీడీసీఎల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలో తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. కడప సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి.అయూబ్‌ఖాన్, నెల్లూరు సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ (ఎనర్జీ కన్సర్వేషన్, క్వాలిటీ కంట్రోల్) కె.ఆదిశేషయ్య, తిరుపతి సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ (ఓ అండ్ ఎం) డీఎస్ వరకుమార్, కర్నూలు సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ (ట్రైనింగ్) ఆర్.పద్మ, అనంతపురం సర్కిల్‌కు జనరల్ మేనేజర్ (ఐటి,శాప్) సిహెచ్ రామచంద్ర రావులను నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు/ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో వుండాలన్నారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చో వద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడంలాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు/ సిబ్బందికిగానీ లేదా టోల్ ఫ్రీ నంబర్లు : 1912 లేదా 1800 425 155333 కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు : 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

# ఆత్మకూరులో మద్యం దుకాణ విజేతలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఎక్స్ఛేంజ్ సర్కిల్ పరిధిలో 13 మద్యం షాపులకు లాటరీ ద్వారా 13మంది విజేతలుగా నిలిచారు. ఆత్మకూరు సర్కిల్ పరిధిలో 13 దుకాణాలకు 317మంది దరఖాస్తులు చేయగా 2లక్షల వంతున ప్రభుత్వానికి 6.34కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. కాగా 317మందిలో లాటరీ ద్వారా అదృష్టవంతులు 13మంది షాపులు దక్కించుకున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో జి.సుబ్బారావు (షాప్ నెంబర్:136), బి.శ్రీకాంత్ (షాప్ నెంబర్:137), ఎం.కృష్ణ కాంత్ (షాప్ నెంబర్:138), పి.పిచ్చి రెడ్డి (షాప్ నెంబర్: 139), ఆత్మకూరు రూరల్లో బి.వెంకటేశ్వర్లు (షాప్ నెంబర్:140), కె.సుప్రజ (షాప్ నెంబర్:141), ఏఎస్ పేట మండలంలో జి.వెంకట లావణ్య (షాప్ నెంబర్: 142), వి.మల్లికార్జున రావు (షాప్ నెంబర్:143), కలువాయి మండలంలో ఎం.దయాకర్ రెడ్డి (షాప్ నెంబర్: 144), పి.పిచ్చిరెడ్డి (షాపు నెంబర్:145), అనంతసాగరం మండలంలో కె.మోహన్ (షాప్ నెంబర్: 146), ఎం.శాంతి (షాప్ నెంబర్:147), ఎం.బ్రహ్మయ్య (షాప్ నెంబర్: 148)లు మద్యం దుకాణాలను దక్కించుకున్నారు.

# ఎస్టీ కాలనీలో అక్రమాలు, ఆక్రమణలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పురపాలక సంఘం 2వ వార్డు వెంకటరావు పల్లె గిరిజన కాలనీని సుమారు 100 ఇళ్ల తోటి ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసింది. గత రెండు సంవత్సరాల క్రితం గిరిజనుల ఇళ్లను కొంతమంది ఋణమో, ఫణమో ఇచ్చి వారి పేరు మీదకు మున్సిపల్ కార్యాలయంలో బదిలీ కూడా చేయించుకున్నారు. అప్పట్లో ఈ విషయం మీద ఆత్మకూరులో నిరసన కార్యక్రమాలు కూడా చేయడం జరిగింది. ప్రస్తుతం ఆ గిరిజనుల కొరకు వదిలివేసిన స్థలములో కొత్త కొత్తగా నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. గిరిజన ప్రాంతంలో వారే ప్రత్యేకంగా ఉన్నారు. ఇటువంటి ప్రదేశాలలో ఇతరులకు ప్రవేశం ఉండదు. ఆత్మకూరు పురపాలక సంఘంలో ఇటువంటి నియమాలు వర్తించవు. ప్రత్యేక జాతులైన గిరిజనులకు అభద్రతాభావం జాస్తిగా ఉంటుంది. అటువంటి ప్రాంతాలు ఉండాలి. అందుకు అధికారులు వారికి తగిన రక్షణ కల్పించాలి. వెంకట్రావు పల్లె ఇలా అన్యాక్రాంతం కావడం ఆక్షేపనీయం అని, అధికారులు స్పందించి గిరిజన ప్రాంతమైన ఎస్టీ కాలనీని ఆక్రమణల చెర నుంచి విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.



## ఆర్థికసాయం అందజేసిన హెల్పింగ్ హార్ట్స్

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగర మండలం పడమటి ఖమ్మంపాడు గ్రామానికి చెందిన నీరు కట్టు జయ లక్ష్మమ్మకు హెల్పింగ్ హార్ట్స్ సంస్థ వ్యవస్థాపకులు రొండ్ల. వెంకటరమరెడ్డి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పశువుల దాడిలో తీవ్ర గాయాలు పాలై ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న ఎస్సీ కాలనీకి చెందిన జయ లక్ష్మమ్మ పరిస్థితి తెలుసుకొని ఆర్థిక చేయూతతో రమణారెడ్డి దాతృత్వం చాటారు. హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఏర్పాటైన నాటినుండి సంస్థ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎన్నో అవార్డులను పొంది ఉంది. ఆర్థిక సాయంపై సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో బొమ్మిళ్ళ మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఏ సమస్య వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సూచనల మేరకు ములుముడి గ్రామ ఉపసర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండలంలోని ములుమూడి గ్రామంలో అధిక వర్షపాతం వలన కాలవలో పేరుకుపోయిన చెత్తను గ్రామ ప్రజలకు ఇబ్బంది లేకుండా యంత్రాల సహాయంతో చెత్తను తొలగించారు. అదేవిధంగా కాలవ వెడల్పు చేస్తూ వర్షపు నీటిని రోడ్డుపై నిల్వ ఉండకుండా కాలవ లోపలికి వెళ్లే విధంగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరిఫ్ మిత్ర బృందం పాల్గొన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆరిఫ్ మిత్ర బృందం తెలియజేశారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు



**కావలి, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కావలి పట్టణంలో ఆదివారం రాత్రి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా ఎక్కడి ప్రజలు అక్కడ ఆగిపోయి ట్రాఫిక్ అంతరాయం, వర్షాలు కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాల తరలించేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నారు. కాల్ సెంటర్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పరిస్థితులను చక్క దిద్దుతున్న అధికారులు.

## వర్షాలకి అప్రమత్తంగా ఉండండి



**కలువాయి, మేజర్‌న్యూస్ :** వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ప్రతాప్ తెలిపారు. మండలంలోని గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులకు సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. తీవ్ర వర్షా బావ పరిస్థితుల దృష్ట్యా మండలంలో కోయవలసిన 90 ఎకరాలు వరి పైరు, పది ఎకరాలు వేరుశనగ సాగులో ఉన్నాయి కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకొనవలసినదిగా తెలిపారు. రబీ సీజన్‌కు గ్రామాల వారీగా వరి విత్తనాలు, పచ్చి శనగ విత్తనాలు ఎంత మేరకు అవసరమో వ్యవసాయ సహాయకుల ద్వారా అంచనా వేసి ఇంతవరకు అవసరమో ఏపీ సీడ్స్ ద్వారా ఇండియన్ పెడతామని తెలిపారు.

## ఏఎస్ పేటలో మద్యం షాపుల విజేతలు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని రెండు మద్యం షాపులకు 60 దరఖాస్తులు వేశారు. అయితే సోమవారం లాటరీ సిస్టం ద్వారా డ్రా తీయడంతో ఏఎస్ పేటలోని 142వ షాపు వెంకట లావణ్య 143వ మద్యం షాపు వి.మల్లికార్జున రావులు లాటరీలో కైవసం చేసుకున్నారు. ఒక్కొక్క షాపుకు 30 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

# నెల్లూరు రూరల్ ఆమంచర్ల గ్రామంలో పల్లె పండుగ

- రూరల్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా ఎమ్మెల్యే అడుగులు
- ఘనంగా రూరల్‌లో పల్లెపండుగ -పంచాయతీ వారోత్సవాలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని ఆమంచర్ల గ్రామంలో పల్లె పండగ కార్యక్రమానికి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్య క్రమంలో వారు మాట్లాడుతూ.. ఆమంచర్ల గ్రామంలో 20లక్షల రూపాయల నిధులతో డ్రైన్ లకు, సీసీ రోడ్లుకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వారం రోజులపాటు ఈ పల్లె పండగ కార్యక్రమం ఉంటుంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 18 గ్రామాల్లో 2కోట్ల రూపా యల నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, మౌలిక వస తుల కల్పన కోసం కృషి చేస్తామని తెలియ జేశారు. నెల్లూరు రూరల్ నియోజవర్గ అభివృద్దే లక్ష్యంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్య త్తులో నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయటమే మా జెండా – అజెండా అని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.గంగా భవా ని, రూరల్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధి కారి వి.శైలేంద్ర కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ జల దంకి సుధాకర్, వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసు లురెడ్డి, ఎంపీపీ విజయ్‌కుమార్ యాదవ్, సర్పంచ్ కుందుకూరు రమణమ్మ, ఎంపీటీసీ సాదినేని హనుమాయమ్మ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ అల్లా భక్షు, ఉపసర్పంచ్ మల్లినేని వేణునాయుడు, టీడీపీ నాయకులు సాదినేని వెంకటేశ్వర్లు, నెట్టం చిరంజీవి నాయుడు, వాకా వెంకటేశ్వర్లు యాదవ్, దాసరి అశోక్, కొంగర శ్రీనివాసులు నాయుడు, గుటూరు భాస్కర్ నాయుడు, మండల అధికారులు పాల్గొన్నారు.

# ఏఎస్ పేట బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు





**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని మెయిన్ బజార్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు ఆక్ర మణలకు గురి చేయడంతో వర్షపు నీరు వెళ్లేం దుకు వీలు లేక రోడ్డుపైనే మోకాళ్ళ లోతు వర్షపు నీరు నిలిచాయి. సంబంధిత అధికారులు మాత్రం పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రమైన ఏఎస్పేట బస్టాండ్ సెంటర్లో

### పట్టించుకోని అధికారులు

రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు ఇంటి ముంగిట మట్టిని ఎత్తుగా వేసుకున్నారు. అయితే చిన్నపాటి వర్షానికి బస్టాండ్ సమీపంలో వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో నీరు నిలు స్తున్నాయి. దాంతో వాహనదారులు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు గానీ పంచాయతీ అధికారులు గానీ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపి స్తున్నారు. గత నెల రోజుల నుండి రోడ్డుపై నీరు చేరడంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మెయిన్ బజార్‌లో ఆక్రమణలో తొలగించి వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మెయిన్ బజార్లో డ్రైనేజ్ కాలువలను మంజూరు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నిమజ్జనానికి తరలిన అమ్మవారు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయగిరి పట్టణంలోని బాలాజీనగర్‌లో కొలువుదీరిన అమ్మవారి ప్రతి మను సోమవారం నిమజ్జనానికి తరలించారు. వాసుకి సుధాకర్ ఆధ్వర్యం లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక వాహనంపై ఉంచారు. అలాగే నవరాత్రుల సందర్భంగా వివిధ రకాల అలంకరణలో పూజలం దుకున్న అమ్మవారి విగ్రహాలను ట్రాక్టర్లలో ఉంచి అమ్మవారి ప్రతిమ వాహనం వెంట బాలాజీనగర్ నుంచి పంచాయతీ బస్టాండ్ మెయిన్ వీధిలో శివాలయం వరకు ఊరేగింపు చేశారు. అడుగడున భక్తులు అమ్మవారికి కాయాకర్పూరాలు అందజేసి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేసేందుకు గండిపాళెం జలాశయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండండి



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** ఈనెల 14 నుండి 17వ తేదీ వరకు సైదాపురం మండలం నెల్లూరు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు ఉన్నాయని, ప్రతి ఒక్క మండలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని సైదాపురం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా సైదాపురం ప్రజలకు ఈ భారీ వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని మండల తాసిల్దారు, పంచాయతీ కార్యదర్శి, ఎన్ఆర్‌జిఎస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సైదాపురం మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్ర త్తలు తీసుకోవాలని ఎంపీడీవో విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

## వర్షం కురిస్తే గుంతలమయమే..



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** వర్షం వస్తే సైదాపురం టు పొదలకూరు రోడ్డు భారీ గుంతలతో అద్వాన స్థితిలో ఉంది. గత ఐదేళ్లుగా మైనింగ్ లారీల వల్ల కనుమరుగై పోయిన రోడ్డు ఈ ఐదేళ్లు సైదాపురం మండల ప్రజలు నాన్న అవస్థలు పడుతుంటే పట్టించుకునే నాధుడే లేకపోయే ఇదిలా ఉండగా ప్రస్తుతం వర్షాకాలం మొదలవడంతో సైదాపురం నుండి పొదలకూరు సమీపం దేగపూడి వరకు రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో దారి కనపడకపోవడం ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తుంది ఇప్పటికైనా సైదాపురం మండల ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్పందించే రోడ్లు వేయాల్సిందిగా సైదాపురం మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## తుఫాన్ పై అధికారుల సమీక్ష




**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన అధికార సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొ న్నారు. తుఫాను, అధిక వర్షపాతం నేపథ్యంలో మండల స్థాయి అధికార ులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యంగా తుఫాను వచ్చే సమయంలో తీసుకోవలసిన వివిధ శాఖల ముందస్తు చర్యలను పై చర్చించి వాటికి కావలసినటువంటి ఏర్పాట్లను చేసుకోవా ల్సిందిగా అందరూ అధికారులను ఆదేశించడం జరిగింది. ఇప్పటివరకు మండలంలో ఎటువంటి ఆస్తినష్టం జరుగలేదని తెలిపారు. ఈ సమావేశం లో మండలస్థాయి అధికారులు అందరూ హాజరు కావడం జరిగింది.

## ఉదయగిరిలో 67.6 మి.మి వర్షం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మెట్టప్రాంతమె న ఉదయగిరిలో సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేని వర్షం కురిసి 67.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8.30 గంటల వరకు 32.4.12 గంటల వరకు 10, 4 గంటల వరకు 25.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా పట్టణంలోని మురుగు కాలువలు పొంగిపొర్లాయి. వీదుల్లో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. ఎడతెరిపిలేని వర్షం కురవడంతో ప్రజలు నివాసాలకే పరిమితం కావడంతో జనజీవనం స్తంభించింది. ఈ వర్షం ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పాటు రబీ సీజన్లో సాగు చేసే పంటలకు ఊరటనిచ్చింది.

## కావలి పట్టణంలో మద్యం షాపుల విజేతలు

**కావలి, మేజర్‌న్యూస్ :** నూతనంగా రాష్ట్రంలో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చిన విషయం తెలిసినదే అయితే నియోజకవర్గాల వారీగా జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో మద్యం లాటరీ పద్ధతిని ఏర్పాటు చేయడం జరిగింది. కావలి పట్టణంలో ఆరు మద్యం షాపులకు లాటరీ సిస్టం ద్వారా విజేతలను ప్రకటించారు. వాటిలో షాప్ నెంబర్ 41, చావ మహేశ్వరరావు, షాప్ నంబర్ 44, ఇసుక విక్రమ్ కుమార్ రెడ్డి, షాప్ నెంబర్ 45, పరిమి. సులోచన, షాప్ నెంబర్ 46, వి.భార్గవ్ షాప్ నెంబర్ 47, ఎన్.శ్రీనాథ్‌రెడ్డి షాప్ నెంబర్ 48, సిహెచ్ మహేంద్ర లాటరీలో షాపులను దక్కించుకున్నారు.

# ఆత్మకూరులో వర్షం.. రైతులకు నష్టం..





● ప్రజల్లో హర్షం ● తీరంలో ఆందోళనకరం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో, మండలంలో, డివిజన్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురవగా ఖరీఫ్ పంట సాగు చేసిన రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడగా, ప్రజలు హర్షిస్తుండగా పెన్నానదీ పరీవాహక గ్రామాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తుఫాన్, వరదల సమయంలో కూడా ఆత్మకూరు ప్రాంతంలో సక్రమంగా వర్షం కురిసే పరిస్థితి లేకపోగా ఈ దపా మాత్రం సోమవారం తెల్లవారుఝుము నుండి ఓ మోస్తరు వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. రోడ్లు జలమయమై జనజీవనం ఇబ్బందికరంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అల్ప పీడనంగా మారి నాలుగు రోజులు ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు చేస్తున్నారు. డివిజన్‌లోని చిన్నా, పెద్దా వాగులు పొంగి తీర ప్రాంతాల్లో ఇళ్ళు జలమయ్యే పరిస్థితి ఏర్పడగలదని ఆందోళన చెందుతున్నారు. పంట దశలో ఉన్న వరి దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం డివిజన్ లోని సీతారామాపురం మండలంలో 15. మిల్లీ మీటర్లు, మర్రిపాడు మండలంలో 23.2, చేజర్ల మండలంలో 30.2, ఆత్మకూరు మండలంలో 37.4, ఉదయగిరి మండలంలో 11.2, ఏ ఎస్ పేట మండలంలో 31.2, అనంతసాగరం మండలంలో 88.4, సంగం మండలంలో 56.8, కలువాయి మండలంలో 45.5 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్ష హెచ్చరికలతో ఆర్డీవో, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్డీవో బి.పావని డివిజన్లోని తహసీల్దార్లు, ఇతర అధికారులను అప్రమత్తం చేసి తీర ప్రాంతాల్లో పర్యటించారు. సీఐ గంగాధర్ బండారుపల్లి తదితర గ్రామాలు, బొగ్గెరును పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలను ఆర్డీవో పరిశీలించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా అన్నీ జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అవసరమైన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని, నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచామని ఆర్డీవో పావని తెలిపారు. ప్రజలు కూడా ఈ నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, వర్షం వలన ఎలాంటి ఇబ్బంది ఉన్నా సమీపంలోని అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆర్డీవో పావని సూచించారు. తామంతా 24గంటలు అందుబాటులో ఉంటామని, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆనం విజ్ఞప్తి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి వర్షాభావ పరిస్థితుల వల్ల రూరల్ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడ ప్రభావం వలన 14, 15, 16 తేదీల్లో నెల్లూరు జిల్లాకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా ప్రజలకు మరీ ముఖ్యంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రజలందరికీ విజ్ఞప్తి తుఫాను సమయంలో తీవ్ర పెనుగాలులు వీచే అవకాశం, పిడుగులు పడే ప్రమాదం ఉంటుంది కాబట్టి నెల్లూరు రూరల్ ప్రజలు, పశువుల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండి అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ముఖ్యంగా చెట్టు కింద, కరెంటు స్తంభాల కింద ఉండకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలని ముఖ్యంగా పల్లె ప్రాంతం ప్రజలు, మత్స్యకారులు ఈ సమయంలో కాలువలో చెరువుల్లో వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండే సురక్షిత ప్రాంతాలలో ఉండాలని కోరడమైనది అదేవిధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి తుఫాను ప్రభావం వల్ల ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే మీరందరూ అందుబాటులో ఉండి, సహాయకి



చర్యల్లో ముమ్మరంగా పాల్గొనవలసిందిగా కోరుతున్నానన్నారు.

## సోమశిల నుంచి నీటి విడుదల నిలుపుదల



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల జలాశయం నుండి వివిధ మార్గాల ద్వారా విడుదల చేస్తున్న నీటి పంపిణీని సోమవారం ప్రాజెక్టు అధికారులు నిలుపుదల చేశారు. రాష్ట్రవ్యాప్త తుఫాను హెచ్చరికల నేపథ్యంలో సోమశిల ప్రాజెక్టు నుండి ఉత్తర కాలువ, పెన్నా డెల్టాకు చేపడుతూ వచ్చిన నీటి విడుదలను తాత్కాలికంగా ఆపివేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు అధికారులు ఈ చర్యలకు ఉపక్రమించారు. కాలువలు,పెన్నా పరివాహక ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తూ ఉండడంతో నీటి పంపిణీని నిలుపుదల చేసినట్లు తెలుస్తోంది.

## ప్రశాంతంగా సాగిన లక్కీ డీప్ ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)



మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. రెండు టేబుళ్లను ఏర్పాటుచేసి ఒక్కొక్క టేబుల్ వద్ద ఇద్దరు వీడియో గ్రాఫర్లతో పూర్తి ప్రక్రియను వీడియోగ్రాఫి చిత్రీకరించినట్లు చెప్పారు. ఒక టేబుల్ వద్ద తాను, మరొక టేబుల్ వద్ద జాయింట్ కలెక్టర్ పూర్తిగా ప్రక్రియను పర్యవేక్షించినట్లు చెప్పారు. ఆయా షాపులకు టెండర్లు దాఖలు చేసిన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీడిప్ తీసి షాపు దక్కించుకున్న వారి పేరును ప్రకటించినట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 182 మద్యం దుకాణాలకు 3872మంది టెండర్లు దాఖలు చేయగా, 182 మద్యం షాపులకు లక్కీడిప్ ద్వారా 182 మందిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ లక్కీడిప్ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులునాయుడు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రమేష్, డిపో సూపరింటెండెంట్ ఆయేషా బేగం, ఎక్సైజ్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పాజీ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకలు పారే అవకాశమున్నందున ప్రజలు వాటి వద్దకు వెళ్లక ఒడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరీముల్లా, నాగూర్ బి.చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటరమణ, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## తీరప్రాంత గ్రామాలను పరిశీలించిన ఆర్డీవో



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పెన్నా పరివాహక గ్రామాలైన వీర్ల గుడిపాడు, అప్పారావు పాలెం, కొత్తపాలెం గ్రామాలను ఆర్డీవో భూమిరెడ్డి పావని సోమవారం పరిశీలించారు. ఆ గ్రామాలను సందర్శించి లోతట్టు గ్రామ ప్రజలను అప్రమత్తం చేశారు. ఆమె వెంట ఆత్మకూరు తహసిల్దార్ సుధీర్, ఆర్.ఐ పృద్వి కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాను హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండండి : సీఐ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలంలోని పలు అలుగు ప్రాంతాలను ఆత్మకూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గంగాధరరావు, సోమవారం పరిశీలించారు. మండలంలోని వెంగమ నాయుడు పల్లి, కచరిదేవరాయపల్లి గ్రామాల వద్ద గల వాగులు, అలుగులను ఆయన పరిశీలించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో వరద నీరు ప్రవహించే పరిస్థితులు నెలకొని ఉన్నాయని,ప్రమాద పూరిత ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ముందస్తు పరిశీలనలు చేశామని సీఐ తెలిపారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, నీటి ప్రవాహం కొనసాగే వాగులను దాటే ప్రయత్నాలు చేయరాదని సూచించారు.

## ఉదయగిరిలో మద్యం షాపుల విజేతలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలోని మూడు మద్యం షాపులకు 42 దరఖాస్తులు వేశారు. అయితే సోమవారం లాటరీ సిస్టం ద్వారా డ్రా తీయడంతో ఉదయగిరి మండలంలో షాప్ నెంబర్ 95ను వీరారెడ్డి శ్రీకాంత్ రెడ్డి షాప్ నెంబర్ 96ను మున్నేపల్లి ప్రభాకరరెడ్డి, షాప్ నెంబర్ 97ను జూపల్లి రాజారావులు లాటరీలో కైవసం చేసుకున్నారు.



# కడలి కల్లోలం

- ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు
- విడవలూరులో ఎడతెరిపిలేని వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం

**విడవలూరు, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో పాటు ఉపరితల ఆవర్తనం కూడా జతకావడంతో విడవలూరు మండలంలో సోమవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతోపాటు రామతీర్థం రామ చంద్రాపురం ఊటుకూరు తీర ప్రాంతాలలో అలలు ఉవ్వెత్తిన ఎగసిపడ్డాయి. సుమారు మూడు అడుగుల నుంచి ఆరు అడుగుల మేర అలలు కడలి కల్లోలంగా మారింది. సముద్రం లో అలల ఉద్విత ఎక్కువ కావడంతో సముద్రం దాదాపు 30 అడుగుల మేర ముందుకు చొచ్చుకు వచ్చింది. దీంతో అప్రమత్తమైన మత్స్యకారులు సముద్రం ఒడ్డున ఉన్న బోట్లు వలలను మరింత సురక్షిత ప్రాంతాలకు తరలించి భద్రపరుచుకున్నారు. సోమవారం వేకువ నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేని వర్షం కురవడంతో మండల కేంద్రమైన విడవలూరు లోని ప్రధాన రహదారిపై రెండు అడుగుల మేర వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వరిణి, దండిగుంట, రామతీర్థం, రామచంద్రాపురం విడవలూరు, ఊటుకూరు, ముదివర్తి, అలగానిపాడు, దంపూరు, వావిళ్ళ, చౌకచేర్ల, పార్లపల్లి, తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయంగా మారాయి.

### ఆందోళనలో మండల ప్రజలు

భారీ వర్షాలు కారణంగా మరో మూడు రోజులు పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతాయని ప్రభుత్వ హెచ్చరికల నడుమ మండలంలోని ప్రజలు తీవ్ర భయాందోళన గురవుతున్నారు. సోమవారం ఒక్కరోజే ఎడతెరిపిలేని వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని అధికారులు తెలపడంతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ముఖ్యంగా అతి భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునుగుతాయని దీనిని దృష్టిలో ఉంచుకొని తహసిల్దార్ చంద్రశేఖర్ కిందిస్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలను సిద్ధం చేసి ఉంచాలని ఆదేశించారు. తీర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించి వారిని తుఫాన్ షెల్టర్లకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.



# ఆత్మకూరు డివిజన్‌లో అప్రమత్తంగా ఉండాలి

### ఆత్మకూరు ఆర్డీఓ భూమి రెడ్డి పావని



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారీ వర్ష సూచన నేపథ్యంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలో అధికారులందరిని స్థానిక ఆర్డీవో బి.పావని అప్రమత్తం చేశారు. పెన్నా, బొగ్గెరు పరీవాహక గ్రామాల ప్రజలను మండల, గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. అందరినీ అప్రమత్తం చేసి ముందస్తు జాగ్రత్తలను గురించి చర్చించిన ఆర్డీవో డివిజన్ లోని సంగం, ఆత్మకూరు తదితర మండలాల్లో పర్యటించారు. సంగం పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను పెన్నా నది పరివాహక ప్రాంతాలను పరిశీలించి అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని పావని ఆదేశించారు. సంగంలోని పునరావస కేంద్రాలను పరిశీలించారు. కంట్రోల్ రూమ్ వద్ద పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు పై అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మూడు రోజులపాటు భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.

# మర్రిపాడులో 40 మీ.మీ వర్షపాతం

- పొంగిన వాగులు, వంకలు,
- ఆశాజనకంలో రైతులు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం మర్రిపాడు మండలాన్ని తాకింది. దీంతో సోమవారం ఎడతెరిపిలేని వర్షపాతం కురవడంతో 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఫలితంగా మండల పరిధిలోని సన్ను వారిపల్లి వద్దనున్న బొగ్గేరుతో పాటుగా పడమటి నాయుడుపల్లి వద్దనున్న కేతామన్నేరు, మనకంటేరు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో పాటుగా మండలంలోని కొన్ని చెరువులకు జలకల సంతరించుకుంది. ఎప్పటికప్పుడు అటు రెవెన్యూ అధికారులు, ఇటు పోలీసు అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అప్రమత్త పై ఆరాధిస్తూ వస్తున్నారు. అంతేకాకుండా ఎస్ఐ శ్రీనివాసరావు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఏది ఏమైనాప్పటికీ వరుణుడు కరుణించడంతో మెట్ట రైతులకు మేలు చేకూరింది. ఈ వర్షపాతం పొగాకు రైతులకు ఆశాజనకంగా మారింది. ఇక నాట్లు వేయడమే తక్షణ కర్తవ్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు.

# ప్రజల అప్రమత్తంగా ఉండాలి

### ▶ వైసీపీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ, నెల్లూరు సిటీ వైసీపీ ఇన్‌చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో అని మాట్లాడుతూ.. తుఫాను సమయంలో తీవ్రమైన పెనుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా వుండి అవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకి వెళ్లకుండా మరి ముఖ్యంగా కరెంటు స్తంభాలు, సెల్ ఫోన్ టవర్స్ చెట్ల కింద ఉండకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంటూ జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తం వుండాలని కోరారు. అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలను అప్రమత్తం చేసి తుఫాను వలన ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని కోరారు.

# ప్రమాదపుటంచున కదిరినేనిపల్లి చెరువు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని కదిరినేనిపల్లి చెరువు ప్రమాదకర స్థితిలో ఉందని తెలుపుతున్నారు. గ్రామ సమీపంలోని ఇటుక బట్టీలకు మట్టిని విపరీతంగా తరలించినందున ఈ దుస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామస్తులు సోమవారం డిప్యూటీ తహసిల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కొండ కింద ప్రాంతంలో చెరువు ఉన్నందున వర్షాలకు అతిత్వరగా నీరు చేరుతుందని, మరో రెండు రోజులు కురిసే వర్షాలకు చెరువు నిండుతుందని విన్నవించారు. ఈ తరుణంలో చెరువు బలహీనంగా ఉన్న ప్రదేశాల్లో ప్రమాదం పొంచి ఉందని, వీలైనంత త్వరగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

### అధికారులు అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలి

# తుఫాన్‌ను ఎదుర్కోవాలి : మంత్రి 'ఆనం'



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, అల్పపీడనం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. భారీ వర్షాల హెచ్చరికలతో మంత్రి ఆనం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ప్రతీ అధికారి అందుబాటులో ఉండాలని జిల్లాలో తుఫాను నష్టాలు ధీటుగా ఎదుర్కొనేలా ప్రజలందరినీ అప్రమత్తం చేయాలని ఆనం రామనారాయణ రెడ్డి కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆనం కోరారు. జిల్లాలో భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో అధికారులను మంత్రి రామనారాయణ రెడ్డి అప్రమత్తం చేశారు. జిల్లాలో భారీ వర్షాల ప్రభావం, తీసుకున్న జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్‌తో చర్చించిన ఆయన చర్చించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితి అయినా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉందని, ప్రజలు ఆందోళన చెందరాదనీ మంత్రి ఆనం కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు పునరావాస కేంద్రాల ఏర్పాటు జరిగిందన్నారు. మంత్రి ఆనంసూచనలతో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఆర్డీవో బి.పావని పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు.